క్లుప్తంగా

12 నుంచి క్రీడా పోటీలు

రామాపురం : నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, మండల కో–ఆర్డినేటర్ నరేంద్రకుమార్‌రెడ్డిలు మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీన యోగా, షటిల్, చెస్, అథ్లెటిక్స్, 13న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలను అండర్–14, అండర్–17 బాల బాలికల విభాగంలో నిర్వహిస్తామన్నారు.

క్రీడా పోటీలపై నిర్వహణపై..

చిట్వేలి : స్టేట్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే మండలస్థాయి క్రీడా పోటీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన కార్యక్రమంలో క్రీడా పోటీలకు ఏర్పాట్లు, నియామకాలు, నిర్వహణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు.

పకడ్బందీగా ఇసుక బుకింగ్

రాజంపేట : ఇసుక బుకింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి పేర్గొన్నారు. మంగళవారం కూచివారిపల్లె సచివాలయంలో నిర్వహిస్తున్న ఇసుక బుకింగ్ విధానాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాగా ఇసుక బుకింగ్ నిర్వహణలో అనేక ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో సబ్‌కలెక్టర్ ఇసుక బుకింగ్‌పై దృష్టి సారించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్.బుడగుంటపల్లెలోని మూడు ఇసుక రీచ్‌లకు సంబంధించి ఇసుక బుక్ చేసుకునే విధానంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. ఇసుక బుకింగ్ విధానంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు.

వేమన పద్య పుస్తకాలు పంపిణీ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వేమన పద్యాల పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, రమణమ్మలు పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు పుస్తకాలు అందజేయడానికి సహకరించిన రెడ్డి సేవా సమితి సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, శిల్పి ఆనందాచారి, రవిశంకర్ రెడ్డి, విజయకుమారి, తులసీ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సుండుపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వి.జయన్న ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న తెలుగు ఉపాధ్యాయుడు నాగరాజు నాయక్, ఆంగ్ల ఉపాధ్యాయులు నాగేంద్రబాబులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ వృత్తినే దైవంగా భావిస్తూ విద్యార్థుల శ్రేయస్సు కోసం కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులకు అవార్డులు రావడం హర్షనీయమన్నారు. వీరికి భవిష్యత్తులో రాష్ట్రస్థాయి అవార్డు కూడా రావాలని ఆకాంక్షించారు.

గ్రామాల్లో నిఘా పెంచండి

పెనగలూరు : గ్రామీణ ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని మహిళా పోలీసులకు రాజంపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బివి రమణ సూచించారు. మంగళవారం పెనగలూరు పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులను స్టేషన్‌కు పిలిపించి వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాలలో ఎలాంటి సంఘటనలు జరిగినా ఎప్పటికప్పుడు పైస్థాయి అధికారులకు తెలియజేయాలని కోరారు. పలు అంశాలపై వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

పొలంబడితో అధిక దిగుబడి



రైతులకు సూచనలు చేస్తున్న చంద్రనాయక్

రామాపురం : మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉత్తమ వ్యవసాయ పద్ధతులు ఆచరించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గొల్లపల్లి గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమానికి ఆయన పర్యవేక్షించారు. మాట్లాడుతూ రైతులకు పొలంబడి ఆవశ్యకతను తెలియజేశారు. వేరుశనగ పంటలో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చునన్నారు. అలాగే చాలా కాలం నుండి బీడుగా ఉన్న భూములను సాగులోకి తీసుకురావాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయుడు రాజశేఖర్

చిట్వేలి : సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్సు అవార్డుకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పి.రాజశేఖర్ ఎంపికయ్యారు. ఈయన పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా, ఎన్‌సీసీ అధికారిగా సేవలందించినందుకు గాను ఉపాధ్యాయుడు రాజశేఖర్ 2024 సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక అయ్యారు.

కోలాహలంగా గణనాథుని నిమజ్జనోత్సవం

గాలివీడు : మండలవ్యాప్తంగా నాలుగు రోజుల పాటు భక్తుల విశేష పూజలందుకున్న విఘ్ననాయకుడు మంగళవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పట్టణంలో మధ్యాహ్నం నుంచి నిమజ్జన కోలాహలం మొదలైంది. వాడవాడలా కొలువుదీరిన గణేష్ విగ్రహాలకు శోభాయాత్ర జరిపి నిమజ్జనానికి తరలించారు. వెలిగల్లు జలాశయంలో ఈ యేడు విగ్రహాల నిమజ్జనానికి అనుమతులు లేకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో గణేష్ నిమజ్జనం చేశారు.

రాజంపేట టౌన్ : గణనాథుల నిమజ్జన వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. మండలంలోని అనేక ప్రాంతాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళవారం వినాయక నిమజ్జన వేడుకలను చేపట్టారు. విగ్రహాలను ఊరేగింపు తీసుకువెళ్లారు. శోభాయాత్ర అంతా వాయిద్యాలు, డీజేలు, బాణాసంచాలు పేల్చుతూ గంగ ఒడికి వినాయకుడిని చేర్చారు. కాగా పట్టణంలోని అమ్మవారిశాలలో కొలువుదీరిన వినాయకుడి విగ్రహం వద్ద మంగళవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు నిమజ్జనం సందర్భంగా యువకులు అత్యుత్సాహం ప్రదర్శించవద్దని కోరారు. నిమజ్జన వేడుకలను భక్తులు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనాయకుడు పోలా సాయివైభవ్‌రెడ్డి, కౌన్సిలర్ ససిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఏల్చూరి అశోక్, అన్నపూర్ణ మురళీ, హరి, నాగేంద్ర, బి.రాజేష్, నరేంద్ర, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధి పబ్బిశెట్టి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: ఎమ్మెల్యే ఆకేపాటిని సత్కరించిన ఉత్సవ కమిటీ సభ్యులు



రాయచోటి టౌన్: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

రామాపురం : మండలంలో వినాయక చవితి పండుగ సందర్భంగా ఆయా గ్రామాలలో వినాయక కమిటీ సభ్యులు వినాయక విగ్రహాలను గ్రామాలలో ఏర్పాటు చేశారని, నిమజ్జనానికి గ్రామ చివరలో ఉన్న చెరువులను మంగళవారం మండల ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి పరిశీలించారు. మాట్లాడుతూ వినాయక కమిటీ సభ్యులు, వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేటప్పుడు గ్రామ శివారుల్లో ఉన్న చెరువుల లోనే నిమజ్జనం చేయాలని దూర ప్రాంతాలకు తీసుకువెళ్లదని ఆయన వారికి సూచించారు. ఒక వేళ ఆయా గ్రామాలలో పరిధిలోని చెరువులలో నీళ్లు లేకుండా ఉంటే ఇతర గ్రామాలలోని వెళ్లాలన్నారు. నిమజ్జనం చేసేటప్పుడు చిన్న పిల్లలను చెరువు వద్దకు పోనికుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బొమ్మల కింద ఎవరు గాని ఉండకూడదన్నారు. ఊరేగింపు చేసేటప్పుడు విద్యుత్‌తీగల తగలకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కమిటీ సభ్యులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిగేటప్పుడు కమిటీ సభ్యులు దగ్గర ఉండి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని అమ్మవారిశాల సమీపంలో ఏర్పాటైన గణనాథుని విగ్రహం వద్ద వి.జయకుమార్‌రెడ్డి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేత సాయిలోకేష్ తదితరులు భక్తులకు ఆహారాన్ని వడ్డించారు.

రాయచోటి టౌన్ : వినాయకుడిని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఆకాంక్షించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులోని ఎంఎస్ఆర్ కాలనీలో కొలువుదీరిన వినాయకుడిని ఎస్ఐ నరసింహారెడ్డితో కలసి దర్శించుకున్నారు. వీరికి నిర్వాహకులు వీరి పేరున పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాయచోటి పట్టణంలోని పలు వినాయకుడి మంటపాలలో మడితాటి శ్రీనివాసుల రెడ్డి (కోడి శ్రీను) ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని ట్రంకు రోడ్డు సర్కిల్ వద్ద ఉన్న మేదర వీధిలో, గున్నికుంట్ల రోడ్డులోని అల్తాఫ్ కల్యాణ మండపం సమీపంలో, రాయుడు కాలనీలో, అరవీడు వద్ద ఏర్పాటు వెలసిన శ్రీ వినాయకుడి మంటపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామాపురం : శ్రీ గణేష్ ప్రతిమల మండపాల వద్ద ప్రతిమల నిర్వాహకులు విశేష పూజలు, నివేదనలు సమర్పిస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు పూజల అనంతరం దాతల సహకారంతో అన్నదానం చేస్తున్నారు. మండలంలో బుధవారం 5వ రోజు కావడంతో గణేష్ ప్రతిమలకు ఉద్యాసన పూజల నిర్వహించిన అనంతరం గ్రామోత్సవంగా డప్పువాయిద్యాల నడుమ నిమజ్జనాలకు గణేష్ ప్రతిమలను తరలించనున్నారు.

సుండుపల్లె : మండల పరిధిలోని రెడ్ల చెరువు – కొత్త వడ్డెపల్లె మార్గమధ్యలోని పెనిగుండ్లలో వెలసిన దక్షిణముఖ వినాయకుడిని దర్శించుకుంటే వివాహాలు జరుగుతాయనేది భక్తుల విశ్వాసం. మంగళవారం వినాయకుడికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అలానే పెద్దబలిజపల్లి, గుట్టకాడ బలిజపల్లిలతో పాటు పలు గ్రామాలలో గణనాథుని ఊరేగింపును మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ ఎం.శ్రీనివాసులు బందబోస్తు ఏర్పాటు చేశారు.

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 గ్రామం భద్రావతి భావనారాయణ స్వామి సన్నిదిలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి నాలుగు రోజులపాటు విశేష పూజలు జరిగాయి. మంగళవారం గణనాథుని నిమజ్జనం ఊరేగింపు కార్యక్రమం వైభవంగా జరిగింది. స్వామి వారిని గ్రామంలోని పుర వీధుల్లో మేళ తాళాలు, బాణాసంచా పేల్చుతూ ఊరేగింపును నిర్వహించారు.

పెనగలూరు : మండలంలో వినాయక చవితి సందర్భంగా నాల్గవ రోజు మంగళవారం వినాయక స్వామి నిమజ్జనాలు జరిగాయి. మూడోరోజు పెద్దఎత్తున గ్రామాల నుంచి నిమజ్జనానికి వినాయక విగ్రహాలను తరలించగా కొన్ని గ్రామాలలో మంగళవారం కూడా నిమజ్జనం చేశారు. ఎస్ఆర్ పురం వద్ద గుంజన నదిలో నిమజ్జన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

నందలూరు : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి నాయకులు, కార్యకర్తలకు తెలియజేశారు. మంగళవారం ఆకేపాటిని ఎంపీటీసీ పునగాని వెంకటసుబ్బమ్మ, గుణయాదవ్‌లు ఆయన స్వగృహంలో కలిశారు. ఆకేపాటిని పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నరు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, సౌమ్యనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, వైఎస్సార్ సిపి నాయకులు గుండు మల్లికార్జున రెడ్డి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఆనాల మధుయాదవ్, వేణు, మహ్మద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆకేపాటి అమర్నాథరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఘన నివాళి

మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ మాజీ వార్డు మెంబర్ రమణ సతీమణి మృతదేహానికి ఆకేపాటి అమర్నాథరెడ్డి నివాళులర్పించి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

తక్కువ ధరలకే రైతులకు వ్యవసాయ పరికరాలు

వీరబల్లి : మండలంలోని రైతులకు కావాల్సిన పరికరాలు తక్కువ ధరలకే అందిస్తామని వెలుగు ఏపీఎం ఖాదర్ వలీ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో రైతుల ఉత్పత్తిదారుల సమాఖ్య సంఘాల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు, అలాగే సీజన్ పంటలకు కావాల్సిన ధాన్యాలు తక్కువ ధరలకే అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

రాయచోటి టౌన్ : ఎయిడ్స్ రహిత సమాజం కోసం పీసీఎస్ఎస్ టీఐ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో పాత రాయచోటిలో మీకు తెలుసా అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం పాత రాయచోటి పట్టణంలోని వాల్మీకి వీధిలో ప్రజలకు ఎయిడ్స్ నివారణ, పాటించాల్సిన నియంత్రణ చర్యలపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహమ్మద్ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ వ్యాధి అంటుకొనే వ్యాధి కాదని కేవలం మన తప్పిదాల వలన మాత్రమే వస్తుందన్నారు. జాగ్రత్తలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి, సిబ్బంది శ్రీనాథ్, పద్మావతి, ప్రభావతి, నందకుమార్, సావిత్రి, రోజా తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వరద.. ప్రభుత్వ వైఫల్యమే

- చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే 47 మంది మృతి
- బట్టబయలైన ప్రభుత్వ చేతకానితనం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి



రాజంపేట : వరదలు వస్తాయని ముందుగా హెచ్చరికలు ఉన్నప్పటికీ సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం ఆయన తన ఎస్టేట్‌లో విలేకర్లతో మాట్లాడుతూ విజయవాడ వరదల కారణంగా 47 మంది మృతి చెందారని ఆవేదన చెందారు. ముమ్మాటికి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మరణాలు సంభవించాయన్నారు. ముందస్తుగా సరైన జాగ్రత్తలు తీసుకొని ఉంటే ప్రజల ప్రాణాలు నిలిచేవన్నారు. ప్రజలను సకాలంలో తరలించడం, పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయడం వంటివి చంద్రబాబు ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. వరద ఉధృతి ఒక్కసారిగా విజయవాడపై పడటంతో ప్రజలు ఎనిమిది రోజులు బురదనీటిలోనే ఉన్నారన్నారు. వరద బాధితులు అన్నమో రామచంద్రా అంటూ అలమటించారన్నారు. వరద బాధితులకు సహాయం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్పందించారన్నారు. వీరి వితరణ సక్రమంగా బాధితులకు చేరవేయలేదని దీనికి కారణం ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేకపోవడమేనన్నారు. ఇంత చేతకాని ప్రభుత్వం మరొకటి లేదని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి సమీక్ష చేసి అధికారులకు ఆదేశాలివ్వాలే కానీ, వరద ప్రాంతంలో తిష్టవేసి అధికార యంత్రాంగం తన చుట్టు తిప్పుకుంటే సహాయక చర్యలకు విఘాతం కలుగుతుందని తెలియకపోవడం ఆయన అవివేకం అన్నారు. వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి సర్కారు పూర్తిగా విఫలమైందని అభిప్రాయపడ్డారు.

వలంటీర్ వ్యవస్థ ఉండి ఉంటే..

వలంటీర్ వ్యవస్థ ఉంటే వరద బాధితులకు పూర్తిగా న్యాయం జరిగేదని ఆకేపాటి పేర్గొన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరోనాతోపాటు అనేక ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు పూర్తిగా మేలు జరిగిందన్నారు. ఎక్కడా బాధితులు ఇబ్బంది పడలేదని, దీనికి కారణం వలంటీర్ వ్యవస్థేనని అన్నారు. వరదలు వచ్చి వారమవుతున్నా ఇప్పటికీ బాధితుల ఆక్రందనలు వినిపిస్తున్నాయంటే ఈ ప్రభుత్వ చేతకానితనం బట్టబయలైందన్నారు. అలానే వైఎస్ జగన్ ముందుచూపుతో విజయవాడ నగరం వరద ముంపునకు గురికాలేదన్నారు. రీటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టి విజయవాడ నగరాన్ని రక్షించింది ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

విద్య కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

రాయచోటి అర్బన్ : విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈనెల 27, 28, 29 తేదీలలో రాజంపేట పట్టణంలో నిర్వహింపతలపెట్టిన ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభల కరపత్రాలను ఆయన ఏఐఎస్ఎఫ్ నేతలతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశబడ్జెట్‌లో విద్యారంగానికి 10శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని పోరాడుతున్నప్పటికీ పాలకులకు చీమకుట్టినట్లయినా లేదంటూ విమర్శించారు. విభజన హామీల అమలులో భాగంగా అనంతపురం జిల్లాలో సెంట్రల్ యూనివర్శిటీ, కడప ఉక్కు పరిశ్రమ, పెట్రోలియం యూనివర్శిటీలకు నిధులను వెంటనే కేటాయించాలంటూ డిమాండ్ చేశారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేస్తామన్నారు. దశాబ్దాలుగా హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేయాలంటూ డిమాండ్ చేశారు. రాజంపేటలో జరిగే మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాయచోటి అధ్యక్షుడు ప్రశాంత్, నేతలు లోకేష్, రఘుపతి, వంశీ, నారాయణ, శ్రీకాంత్, ధనకుమార్ రెడ్డి, కుమార్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గౌరవవేతనం మంజూరు చేయండి

సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లుకు మూడు నెలల గౌరవ వేతనం మంజూరు చేయాలని మంగళవారం వారు ఎంపీడీఓ జవహర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ వలంటీర్లు 15 ఆగస్టు 2019న సచివాలయంలో వలంటీర్లగా జాయిన్ అయ్యామని, వారికి 2024 మే నెల వరకు గౌరవ వేతనం అందిందన్నారు. గత నెల 8వ తేదీ నుంచి గ్రామ సచివాలయాలలో తాము విధులకు హాజరవుతున్నప్పటికీ సిబ్బంది తమ హాజరును రికార్డులలో వేయడంలేదన్నారు. అలానే మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పాడుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ జవహర్‌బాబు మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు ఉండేది, లేనిది తెలియలేదు. వలంటీర్ల హాజరు నమోదు షీట్ రావడంలేదన్నారు. వినతిపత్రాన్ని సంబంధిత జిల్లా అధికారికి పంపుతామని ఆయన అన్నారు.

క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు వద్దు

సంబేపల్లె : క్షణికావేశంలో తీసుకునే తొందరపాటు నిర్ణయాల వల్ల యేటా సగటును 1.70లక్షల మంది బలన్మరణాలకు పాల్పడుతున్నారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ దిలీప్ కుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తిట్టారని, గురువులు మందలించారని, మార్కులు తక్కువ వచ్చాయని, ర్యాంకులు రాలేదనే కారణాలతో ప్రాణాలు తీసుకుని తల్లిదండ్రులకు గర్భశోకం కలిగించడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చినప్పుడు తల్లిదండ్రులు, స్నేహితులతో తమ భావాలు పంచుకొని ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడాలన్నారు.



పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించండి

రాయచోటి అర్బన్ : మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న ఆప్కాస్ సిబ్బంది 26 మందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఏఓ నాగభూషణంకు ఏఐటీయూసీ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో దాదాపు 26 మంది అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వీరిలో నలుగురికి 13 నెలలుగా, 22 మందికి 7 నెలలుగా జీతాలు అందడంలేదన్నారు. పెండింగ్ జీతాల కోసం ఆప్కాస్ సిబ్బంది ఒకవైపు విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు వారం రోజులుగా ఆసుపత్రి ఎదుట నిరసన ప్రదర్శనలు చేస్తున్నా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని సంబంధిత శాఖ అధికారులతో చర్చించి వెంటనే జీతాలు చెల్లించడానికి కృషిచేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు వేణుగోపాల్‌రెడ్డి, మురళీ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

పెనగలూరు : మండలంలో 2023–24 సంవత్సరానికిగాను రూ.10.38 కోట్లతో ఉపాధిహామీ పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ మద్దిలేటి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణలు తెలిపారు. మంగళవారం సామాజిక తనిఖీ అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సమావేశాన్ని నిర్వహించారు. చేపట్టిన పనులపై డీఆర్‌పీలు చేసిన తనిఖీలపై సమావేశంలో చదివి వినిపించారు. మండలంలో 16 పంచాయతీలు ఉండగా రూ. 4,88,361లు డిఆర్‌పీలు రికవరీ సొమ్ముగా చూపించారు. అయితే విచారణ అనంతరం అధికారులు ఉపాధి సిబ్బందిపై రూ. 1.22లక్షలు జరిమానా విధించారు. అలాగే పెరాలసిస్ వ్యాధి ద్వారా రూ. 15 వేలు పింఛన్ తీసుకున్న వారిపై తనిఖీ వేయనున్నట్లు వారు తెలిపారు. అనంతరం పలు అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ధర్మరాజు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ ప్రతాప్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి ప్రకాష్, రాష్ట్ర పరిశీలకులు లోకేశ్వరరెడ్డి, రవికుమార్ ఎంపీపీ సౌందర్య, ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్ఆర్‌పీ సుబ్బారావు, డీఆర్‌పీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

లక్కిరెడ్డిపల్లి : మార్చి 2024లో జరిగిన పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విశ్వభారతి స్కూల్ విద్యార్థులకు డైరెక్టర్ రామచంద్రయ్య, కరస్పాండెంట్ రఘునాథరాజులు నగదు బహుమతిని ప్రదానం చేశారు. 580 మార్కులు సాధించి మండల, స్కూల్ ప్రథమ స్థానం సాధించిన చైతన్యకు రూ. 16,116లు, గణితంలో వందకు వంద మార్కులు సాధించిన చైతన్య, సంధ్య, షఫియా, ముష్లిహ, నితీష, లక్ష్మీలు ఒక్కొక్కరికి రూ. 6 వేలు, జ్ఞాపికను అందజేశారు. అలాగే 99 మార్కులు సాధించిన కీర్తన్ కుమార్ రాజు, అశోక్, హేమ, అక్షయలకు ప్రోత్సాహంగా రూ. 1000లు నగదుతోపాటు జ్ఞాపికను గణిత ఉపాధ్యాయుడు గంగాధర్ రాజు అందజేశారు. సోషల్ సబ్జెక్టులో 99 మార్కులు సాధించిన నితీషాకు రూ. 2116లు, 98 మార్కులు సాధించిన బ్రహ్మయ్య, అశోక్‌లకు ఒక్కొక్కరికి రూ. 1116లు సోషల్ ఉపాధ్యాయుడు నాగ చెంద్రాయుడు అందజేశారు. కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ రవీంద్ర, ఉపాధ్యాయులు చెంద్రాయుడు, దర్బార్, ప్రతాప్, స్వామికొండ, రవికుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీఓ–85కి వ్యతిరేకంగా వైద్యుల నిరసన

సుండుపల్లె : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ–85కు వ్యతిరేకంగా ప్రభుత్వ ఆస్పత్రుల పీహెచ్‌సీ వైద్యులు మంగళవారం నిరసనలు తెలిపారు. అకస్మాత్తుగా జీఓను తీసుకురావడంతో మాస్టర్స్ చేయాలనుకునే వారికి రిజర్వేషన్‌ను తగ్గించడాన్ని తప్పుబట్టారు. కరోనా సమయంలో ప్రభుత్వ ఆస్పత్రులలో విధులు నిర్వర్తించిన వారికి గుర్తింపుగా ఈ అవకాశం ఇచ్చిందన్నారు. ప్రభుత్వం మారక కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ ద్వారా వైద్యులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ–85ను వెనక్కి తీసుకోవాలని కోరుతూ రాయవరం పీహెచ్‌సీ వద్ద వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈనిర్ణయం గ్రామీణ, గిరిజన ప్రాంతంలో సేవలపై ప్రభావితం పడుతుందన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు

అంతరిక్ష అద్భుతాలను తిలకించిన విద్యార్థులు

రాజంపేట రూరల్ : ఫ్యూచర్ మైండ్స్ పాఠశాలలో మంగళవారం గుంటూరుకు చెందిన స్పేస్ మొబైల్ ప్లానిటోరియంను కరస్పాండెంట్ వై.నందకిషోర్‌గౌడ్ ఏర్పాటు చేశారు. అంతరిక్షానికి సంబంధించిన వీడియోలను 360 డిగ్రీ స్క్రీన్ మీద 3డీ యానిమేషన్‌లో విద్యార్థులకు చూపించారు.

